భారత రాజ్యాంగం - షెడ్యూళ్లు

భారత రాజ్యాంగం – షెడ్యూళ్లు

భారత రాజ్యాంగంలో ప్రత్యేక వర్గాల కోసం, ప్రత్యేక అంశాలతో న్యాయ వ్యవస్థ సమీక్ష నుంచి మినహాయింపు ఉన్న విభాగమే షెడ్యూళ్లు. భారత పార్లమెంట్ మాత్రమే రూపొందించి, పార్లమెంట్ మాత్రమే సవరించగలిగి పార్లమెంట్ రద్దు చేయగలిగిన అంశాలు మన రాజ్యాంగంలోని షెడ్యూళ్లు. 1935 భారత ప్రభుత్వం చట్టం ద్వారా 321 అధికరణలతో పాటు 10 షెడ్యూళ్లను ప్రవేశపెట్టారు. భారత రాజ్యాంగానికి ప్రధాన మూలాధారమైన 1935 చట్టం స్ఫూర్తి గా రాజ్యాంగంలో షెడ్యూళ్లను పొందుపరిచారు. 1950లో అంటే రా జ్యాంగం అమల్లోకి వచ్చినపుడు 8 షెడ్యూళ్లు మాత్రమే ఉండేవి. కానీ ప్రస్తుతం రాజ్యాంగంలో 12 షెడ్యూళ్లు ఉన్నాయి.

మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా 1951లో భూసంస్కరణల కోసం 9వ షెడ్యూల్‌ను చేర్చారు. 1974లో సిక్కిం రాష్ట్రానికి సహరాష్ట్ర ప్రతిపత్తిని కల్పిస్తూ 10వ షెడ్యూల్‌ను చేర్చినప్పటికీ 1976లో 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను కూడా ఇతర రాష్ట్రాలతో పాటు మొదటి షెడ్యూల్‌లో చేర్చడం వల్ల పదో షెడ్యూల్‌ను రద్దు చేశారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ కాలంలో 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రూపొందించి పదో షెడ్యూల్‌గా మన రాజ్యాంగంలో పొందుపరిచారు. 1992లో పి.వి. నర్సింహారావు ప్రభుత్వ కాలంలో 73, 74 రాజ్యాంగ సవరణలు రూపొందించారు.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామీణ పరిపాలన స్థానిక సంస్థ లకు అంటే పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పిస్తూ 11వ షెడ్యూల్‌ను చేర్చారు. ఈ చట్టం 1993 నుంచి అమల్లోకి వచ్చింది. 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ, నగరపాలక సంస్థ లకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పిస్తూ 12వ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో పొందుపరిచారు. 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా పదో షెడ్యూల్‌లో కొన్ని సవరణలు చేశారు.

విద్యాసంస్థల్లో ఇతర వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వే షన్ కల్పిస్తూ చేసిన చట్టాన్ని అమలు చేయడాన్ని తాత్కాలికంగా నిలిపేస్తూ సుప్రీంకోర్టు 2007లో స్టేవిధించిన సందర్భంలో రాజ్యాంగ ధిక్కరణకు పాల్పడే అంశాలు షెడ్యూళ్లలో పొందుపరచినట్లైతే వాటిని కూడా న్యాయసమీక్షకు గురిచేయవచ్చని 1973 తర్వాత 9వ షెడ్యూ ల్‌లో చేర్చిన అంశాలు న్యాయసమీక్షకు అర్హమైనవేనని పేర్కోవడం గమనించదగిన అంశం. 2008లో 23వ రాజ్యాంగ సవరణపై తీర్పు నిస్తూ ప్రైవేట్, ఉన్నత విద్యాసంస్థల్లో ఇతర వెనుకబడిన తరగతులకు కల్పించిన రిజర్వేషన్లను సుప్రీంకోర్టు సమర్థించింది.

షెడ్యూల్ 1:

రాజ్యాంగంలోని 1 నుంచి 4 వరకు అధికరణల్లో మన దేశంలోని 28 రాష్ట్రాలు, దేశ రాజధాని ఢిల్లీతో సహా కేంద్రపాలిత ప్రాంతాల గురించి పేర్కొంటుంది. రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ జరిగినపుడు ఈ షెడ్యూ ల్‌ను తప్పనిసరిగా సవరించాల్సి ఉంటుంది.

షెడ్యూల్ 2:

ఉన్నత పదవుల్లో కొనసాగుతున్న వారి జీతభత్యాలను గురించి పేర్కొంటుంది. 59(3) అధికరణకు సంబంధించిన రాష్ట్రపతి జీతభ త్యాలు, 65(3)ను అనుసరించి ఉపరాష్ట్రపతి రాష్ట్రపతిగా వ్యవహరించే సందర్భంలో చెల్లించే వేతనాల గురించి, 75(6) కేంద్ర మంత్రిమండలి వేతనాలు, 97 అధికరణ ద్వారా రాజ్యసభ, లోక్‌సభాధిపతుల వేత నాలు, 125 సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వేతనాలు, 148(3) CAG వేతనాలు, 158(3) గవర్నర్ జీతభత్యాలు, 164(5) రాష్ట్ర మంత్రిమం డలి వేతనాలను గురించి, 186 రాష్ట్రాల సభాధిపతుల జీతభత్యాలు, 221 అధికరణ హైకోర్ట్ న్యాయమూర్తుల జీతభత్యాలను గురించి పేర్కొంటుంది.

షెడ్యూల్ 3:

కేంద్ర మంత్రుల ప్రమాణ స్వీకారం (75(4)) అధికరణ, పార్లమెంట్ సభ్యుల ప్రమాణస్వీకారం 99వ అధికరణ 124(6)ను అనుసరించి సుప్రీంకోర్ట్ ప్రధాన, ఇతర న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం, కంప్ట్రో లర్ – ఆడిటర్ జనరల్, రాష్ట్ర మంత్రుల, శాసనసభల సభ్యుల, హైకో ర్ట్ న్యాయమూర్తుల పదవీ ప్రమాణస్వీకారాలు గురించి తెలియజే స్తుంది. అంటే భారతదేశంలో ఉన్నత పదవుల్లోని వారి ప్రమాణ స్వీకారాన్ని ఈ షెడ్యూల్ తెలుపుతుంది.

షెడ్యూల్ 4:

రాష్ట్రాల మండలిగా వ్యవహరించే రాజ్యసభలో వివిధ రాష్ట్రాలకు కల్పించిన ప్రాతినిధ్యం గురించి తెలియజేస్తుంది. రాష్ట్రాలకు కల్పించిన 229 మంది సభ్యులు, ఢిల్లీ అదేవిధంగా పాండిచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే నలుగురు సభ్యుల స్థానాలను గురించి కూడా తెలుపుతుంది. కొత్త రాష్ట్రం ఏర్పడినపుడు ఈ షెడ్యూల్‌ను సవరించాలి.

షెడ్యూల్ 5:

రాజ్యాంగంలో 244(1) అధికరణం ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాలు, షెడ్యూల్డ్ తెగల నియంత్రణ, పరిపాలనకు సంబంధించిన అంశాలను గురించి తెలుపుతుంది. ఈ ప్రాంతాల్లోని పరిపాలనాధికారం ఈ

షెడ్యూళ్లలోని నిబంధనలకు లోబడి ఉంటుంది. ఈ ప్రాంత పరిపాలనా అంశాలపై రాష్ట్రపతికి గవర్నర్ రిపోర్ట్ పంపిస్తారు.

షెడ్యూల్ 6:

అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం ప్రాంతాల్లో నివసించే తెగలు, ప్రాంతాల పరిపాలనకు సంబంధించిన నిబంధనల గురించి తెలుపుతుంది. జిల్లా మండలి, ప్రాంతీయ మండళ్ల ఏర్పాటు, శాసనాలు రూపొందించడంలో జిల్లా ప్రాంతీయ మండలాల అధికారాలు స్వయం ప్రతిపత్తి జిల్లాలు, ప్రాంతాల్లో న్యాయపరిపాలన, ఖనిజాలు వెలికితీయడానికి లైసెన్స్‌లు, గనులు అద్దెకివ్వడం, విద్యా నిధులు మొదలైన అంశాలను ఈ షెడ్యూల్ తెలుపుతుంది. పార్లమెంట్, పైన పేర్కొన్న నాలుగు రాష్ట్రాల శాసనసభలు చేసే శాసనాలను స్వయం ప్రతిపత్తి ప్రాంతాలకు వర్తింపచేయడాన్ని తెలుపుతుంది.

షెడ్యూల్ 7:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన అధికారాలకు సంబంధించిన జాబితాలను ఈ షెడ్యూల్‌లో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 246 అధికరణ ఈ అంశాలను తెలుపుతుంది. కేంద్ర జాబితాలోని 99 అంశాలు, రాష్ట్ర జాబితాలో 61 అంశాలు ఉమ్మడి జాబితాలో 52 అంశాలు ఉన్నాయి.

షెడ్యూల్ 8:

344 (1), 351 అధికరణల ద్వారా భారత రాజ్యాంగం గుర్తించిన భాషల గురించి తెలుపుతుంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చినపుడు 14 గుర్తింపు పొందిన భాషలుంటే ప్రస్తుతం ఆ సంఖ్య 22కు పెరిగింది.

షెడ్యూల్ 9:

1951లో మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన ఈ షెడ్యూల్‌లో మొదట భూసంస్కరణల గురించి మాత్రమే పేర్కొంటే ఆ తదనంతర కాలంలో 76వ రాజ్యాంగ సవరణ ద్వారా 1994లో తమిళనాడులో వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు 69% పెంచుతూ ఈ షెడ్యూల్‌లో 257(ఎ) అనే అంశాన్ని చేర్చారు. ప్రస్తుతం ఈ షెడ్యూల్‌లో 284 అంశాలు ఉన్నాయి.

షెడ్యూల్ 10:

1985లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 52వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో చేర్చింది. రాజకీయ పార్టీల గుర్తులపై గెలుపొందినవారు మరొక పార్టీలో చేరినపుడు సభాధిపతులు వారిని అనర్హులుగా ప్రకటించవచ్చు. పార్టీ విప్‌ను ధిక్కరించిన వారిని కూడా అనర్హులుగా ప్రకటించవచ్చు. 1993లో సుప్రీంకోర్టు సభాధిపతుల నిర్ణయాలపై న్యాయ స్థానం సమీక్ష చేయవచ్చని పేర్కొంది.

షెడ్యూల్ 11:

పి.వి. ప్రభుత్వ కాలంలో 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామీణ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పిస్తూ స్థానిక పరిపాలనా సంస్థలకు 29 అంశాలపై అధికారాలుంటాయని పేర్కొంది.

షెడ్యూల్ 12:

1992లో 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ, నగరపాలక సంస్థలకు 18 అంశాలపై అధికారాలను కల్పించాలని పేర్కొంటూ ఈ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో చేర్చారు. అధికారాల బదిలీ రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడి ఉంటుంది.

ప్రాక్టీస్ బిట్స్

1. కింది వ్యాఖ్యల్లో షెడ్యూల్ 4ను ప్రతిబింబించే అంశం? (సివిల్స్ 2004)

ఎ) కేంద్ర, రాష్ట్రాల మధ్య జరిగిన అధికారాల పంపిణీకి సంబంధించిన అంశాలు
బి) రాజ్యాంగం గుర్తించిన భాషలు ఉన్నాయి
సి) షెడ్యూల్డ్ ప్రాంతాల పరిపాలనకు సంబంధించిన అంశాలు
డి) రాజ్యసభలో రాష్ట్రాలకు కల్పించిన ప్రాతినిధ్యం గురించి

2. రాజ్యాంగంలోని ఏ షెడ్యూల్ రాష్ట్రాల పేర్లను, వాటి భూభాగాలను తెలుపుతుంది? (సివిల్స్ 2003)

ఎ) మొదటి బి) రెండో
సి) మూడో డి) నాలుగో

3. భారత యూనియన్‌లో నూతన రాష్ట్రం ఏర్పాటు జరిగితే రాజ్యాంగంలోని ఏ షెడ్యూల్‌ను తప్పనిసరిగా సవరించాలి? (సివిల్స్ 2001)

ఎ) మొదటి బి) రెండో
సి) మూడో డి) ఐదో

4. రాజ్యాంగంలోని ఏ షెడ్యూల్ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం గురించి తెలుపుతుంది? (సివిల్స్ 1998)

ఎ) రెండో బి) ఐదో
సి) ఎనిమిదో డి) పదో

5. కింది భాషల జంటల్లో ఏ జంట భాషలను 71వ రాజ్యాంగ సవరణ ద్వారా 1992లో రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చారు? (గ్రూప్-1 2004)

ఎ) కొంకణీ, సింధీ బి) మణిపురి, సింధీ
సి) నేపాలీ, కొంకణీ డి) సింధీ, నేపాలీ

6. భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు ఈ మధ్య ప్రతిపాదించిన భాషల్లో లేనిది ఏది? (గ్రూప్-1, 2004)

ఎ) బోడో బి) సంతాలి
సి) డోగ్రి డి) భోజ్‌పురి

7. భారత రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్‌లోని ఎన్ని విద్యుక్త అంశాలు ఉన్నాయి? (గ్రూప్-2, 2008)

ఎ) 29 బి) 18 సి) 26 డి) 28

8. **పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలకు పోటీచేసే అభ్యర్థులు ప్రమాణం చేయాల్సిన అంశాన్ని గురించి తెలిపే షెడ్యూల్?**

ఎ) రెండో బి) మూడో

సి) పదో డి) ఏదీ కాదు

9. **ఆరో షెడ్యూల్ ద్వారా ప్రత్యేక పరిపాల నా మండలాలకు సంబంధించిన అంశాలు వర్తించే రాష్ట్రాలు?**

ఎ) అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం

బి) మణిపూర్, మేఘాలయ, త్రిపుర, మిజోరాం

సి) అస్సాం, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్

డి) సిక్కిం, మణిపూర్, త్రిపుర, మిజోరాం

10. **కేంద్ర-రాష్ట్రాల మధ్య జరిగిన అధికారాల పంపిణీ జాబితాలను గురించి తెలిపే షెడ్యూల్?**

ఎ) నాలుగో బి) ఐదో

సి) ఏడో డి) ఎనిమిదో

సమాధానాలు:

1) డి 2) ఎ 3) ఎ 4) డి 5) సి 6) డి 7) ఎ 8) బి 9) ఎ 10) సి